
సాక్షి పల్నాడు

సోమవారం । 4 । నవంబర్ । 2024



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. లాంచీస్టేషన్ నుంచి కొండకు వెళ్లిన వారి నుంచి రూ. 41 వేలు సమకూరింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 588 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు వదిలారు.



ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది.

న్యూస్‌రీల్

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల ప్రగతికి బాలోత్సవం దోహదపడుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవం -2024 బ్రోచర్‌ను ఆదివారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ వేర్వేరుగా ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14వ తేదీలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో ఈ వేడుక నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, కట్టా కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 65 విభాగాలలో పోటీ పడతారని వివరించారు. గత ఏడాది 175 పాఠశాలల నుంచి 8 వేల మంది హాజరయ్యారని, ఈ సారి 10 వేల మంది వస్తారని భావించి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, కమిటీ గౌరవాధ్యక్షుడు ఎంఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో 3 నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఎస్సీ వెల్ఫేర్ సాధికారిత అధికారి ఎస్.ఓబుల్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఉచిత శిక్షణకు ఎంపిక చేయనున్నట్టు వివరించారు. ఎస్‌జీటీలకు ఇంటర్మీడియట్‌తోపాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీతోపాటు బీఈడీ, టెట్ విద్యార్హతలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలు



మాచర్ల: కొత్తపల్లి గ్రామంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నాగార్జునసాగర్ 400 కేవీ సబ్‌స్టేషన్ చీఫ్ మేనేజర్ జెల్ల రాము ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఓరుగంటి చిన్నారెడ్డి మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు విజిలెన్స్‌పై అవగాహన నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. పవర్ గ్రిడ్ మేనేజర్ సుబోధ్కంత్ మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం, అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ మేనేజర్ రాము మాట్లాడుతూ.. కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటి ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీ-2024 నినాదంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌జీవో సభ్యులు బంగారయ్య, పవర్ గ్రిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మంగళగిరి: అక్రమంగా రవాణా చేస్తున్న గోవులను పోలీసులు కాపాడారు. జీవాలను గోశాలకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ... ఆదివారం తెల్లవారుజామున గోవులు తరలిస్తున్న లారీని విధులలో ఉన్న హోంగార్డు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు వంతెన వద్ద గోవులను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సురక్షితంగా నరసింహస్వామి గోశాలకు తరలించారు. అక్కడి నిర్వాహకులకు అప్పగించారు. గోవుల అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. ఎవరైనా ఇలా గోవులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

కోటప్పకొండపై కార్తిక రద్దీ







నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తిక మాసంలో స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, అభిషేక దర్శనాలు చేసుకున్నారు. ఆది, సోమవారాల్లో మూలవిరాట్ అభిషేకాలు నిలిపివేశారు. దీంతో అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. పొంగళ్లు పొంగించి స్వామి వారికి సమర్పించారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, మహానందీశ్వరుడు వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మెట్లపూజ చేసుకుంటూ కొండమీదకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది.

అమరావతికి పోటెత్తిన భక్తులు

అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరాలయానికి ఆదివారం తెల్లవారు జాము నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. తొలుత కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసిన తర్వాత ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలతో శివకేశవులకు భక్తులు పూజలు చేశారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ దేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు, యాత్రికులు, భక్తులతో ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పాత, కొత్త మ్యూజియాలు, అమరేశ్వరాలయం, స్నానాల ఘాట్‌లు కళకళలాడాయి.



ఆపసోపాల అపార్

- నత్తనడకన నమోదు ప్రక్రియ
- ఆధార్‌లో తేడాలే జాప్యానికి కారణం
- సవరణలకు విద్యార్థుల అష్టకష్టాలు

సత్తెనపల్లి: నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవిత కాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని మూడేళ్ల కిందటే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ మాదిరిగానే ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో గుర్తింపు కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల అకాడమిక్ పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది. జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. తొలి విడతగా 9,10 తరగతుల విద్యార్థులకు వీటిని జారీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ తరగతుల విద్యార్థులు 58,990 మంది ఉన్నారు. అపార్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారులు ఆయా బడుల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చారు.

విద్యార్థుల వివరాల్లో తేడాలు...

అపార్ కార్డుల జారీలో ఇబ్బందులు తప్పడం లేదు. జారీ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. లక్ష్యం మేరకు కార్డులు జారీ చేయకపోతే తాఖీదులు ఇస్తామని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే హుకుం జారీ చేశారు. చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల దస్త్రాల్లో ఒకరకంగా ... ఆధార్ కార్డులో మరో రకంగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో 30 నుంచి 50 శాతం వివరాలే సరిపోలుతున్నాయి. ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులు ఉంటున్నాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తి అయ్యేవరకు ఇదే నెంబర్ ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల వివరాల నమోదులో పొరపాట్లకు తావు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



అపార్ నమూనా కార్డు

తప్పులు సవరించుకుంటేనే...

7–8 ఏళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులు ఉన్నాయి. దీంతో వాటిని సరి చేసుకోవాల్సి ఉంది. ఇందు కోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లాలి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆధార్ సవరణ కేంద్రాలు లేవు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పక్క గ్రామాలకు తీసుకెళ్లి వివరాలు మార్చుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ పనుల కారణంగా చాలామంది ఇందుకోసం సమయం వెచ్చించలేకపోతున్నారు.

ఇలా చేస్తే మేలు

- పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లను అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు మార్చే అధికారం ఇవ్వాలి.
- స్కూల్‌లో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్టిఫికెట్ ఇస్తే ఈ వివరాల ప్రకారం ఆధార్ సవరణ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
- ఆధార్ వివరాల సవరణ బాధ్యత కూడా ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రైల్వేలో పార్శిల్ బుకింగ్ నిలిపివేత

- ఒక నిమిషం హాల్టింగ్ స్టేషన్లలో అమలు
- గుంటూరు నుంచే ఇక బుకింగ్



నరసరావుపేట స్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయం

నరసరావుపేట: పార్శిల్ బుకింగ్‌లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. రైళ్లు కేవలం వన్ మినిట్ ఆగే స్టేషన్లలో బుకింగ్ సౌకర్యాన్ని నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రయాణికులు టిక్కెట్ తీసుకొని తమతో పార్శిల్ బుక్ చేస్తే తీసుకెళ్లే అవకాశం కల్పిస్తున్నారు. ప్రయాణికులకు ఇబ్బందుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రైళ్లు ఐదు నిమిషాలకుపైగా ఆగే స్టేషన్లు అయిన గుంటూరు, నంద్యాలలో మాత్రమే ప్రస్తుతం పార్శిల్ బుకింగ్ సౌకర్యం ఉంది.

ముఖ్యంగా బెంగళూరు, గోవా, కాచిగూడ, మహబూబ్‌నగర్, జడ్చర్ల, ఆలంపూర్, శంషాబాద్, రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి తదితర ప్రాంతాలకు లగేజీ బుకింగ్ సౌలభ్యం ఉండేది. తాజా నిర్ణయం కారణంగా ప్రయాణికులు ఈ అవకాశం కోల్పోయారు. ఏదైనా లగేజ్‌ని పల్నాడు ప్రాంత వాసులు బుక్ చేయాల్సి వస్తే గుంటూరులోని కేంద్రానికి వెళ్లాల్సిందే. అదేవిధంగా బెంగళూరు, గోవా, కాచిగూడ, తిరుపతి. కర్నూలు. కడప, అనంతపురం, నంద్యాల, గిద్దలూరు లాంటి ప్రాంతాల నుంచి పల్నాడు ప్రాంతానికి చెందిన వారు ఏ విధమైన లగేజీలను బుక్ చేసుకున్నా.. నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో డెలివరీ తీసుకునే అవకాశం కోల్పోతున్నారు. వీరంతా ఇక నుంచి గుంటూరు పార్శిల్ కేంద్రం నుంచే డెలివరీ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా ప్రతి రైలు ప్రారంభపు స్టేజీ నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణించే సమయంలో కొంత లూజ్ టైం కూడా నిర్ణయించి నడుపుతారు. ఈ లూజ్ టైంలోనే ఆయా ప్రాంతాలలో బుకింగ్ చేసిన పార్శిళ్లను పార్శిల్ పాయింట్ కమర్షియల్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో దించడం, ఎక్కించడం చేస్తుంటారు. రైలు నడిపే క్రమంలోనే దాని షెడ్యూల్లో ఈ లూజ్ టైం కూడా కలిపి అధికారులు టైంటేబుల్ అమలు చేస్తుంటారు. బుకింగ్ రద్దు నిర్ణయంపై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పార్శిల్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఈత కొలను

- అధికారంలోకి రాగానే వినియోగంలోకి తెస్తానన్న ఎమ్మెల్యే
- ఐదు నెలలు గడుస్తున్నా హామీ నెరవేర్చని వైనం



సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో మూతపడిన స్విమ్మింగ్ పూల్

నరసరావుపేట: తాము అధికారంలోకి వస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు... ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలవుతున్నా ఈ విషయంలో విఫలం అవుతున్నారు. సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు (డీఎస్‌ఏ) స్టేడియంలో మూతపడిన స్విమ్మింగ్ పూల్ తెరవడంలో కూడా ఇలా మీనమేషాలు లెక్కిస్తున్నారు. రూ.2.11కోట్లతో నిర్మించిన ఈ కొలనులో ఎంతో మంది ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. 2019 జనవరి 7వ తేదీన దీన్ని నిర్మించారు. అప్పట్లో వ్యాయామం కోసం ఉదయం, సాయంత్రం పలువురు ఇక్కడ ఈత కొట్టేసేదతీరారు. యువతీయువకులు, విద్యార్థులు ఈత నేర్చుకున్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాల ఈత కొలనుకు పోటీగా ఈ పూల్ ఏర్పడింది. ఒకానొక సమయంలో దీనిని నిర్వహించలేక కళాశాల యాజమాన్యం ఈత కొలను మూసేయాలనే ఆలోచన చేస్తున్నారనే వార్తలు కూడా వచ్చాయి. గత ప్రభుత్వంలో స్టేడియంలోని ఈత కొలనుకు కావాల్సిన అదనపు సౌకర్యాలను అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కల్పించారు. నిర్వహణ లోపంతో క్రమంగా మూతపడింది. డీఎస్‌ఏ అధికారులు ఎవరూ మళ్లీ తెరిచే ప్రయత్నం చేయలేదు. దీనిని సాకుగా తీసుకొని గత ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ చదలవాడ అరవిందబాబు అనేక మార్లు అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తాము అధికారంలోకి రాగానే మళ్లీ వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. గెలుపొందిన పదీపదిహేను రోజులలో పరిశీలించిన ఎమ్మెల్యే .. ఈతకొలను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు అందజేస్తానన్నారు. ఈ మాట చెప్పి నెలలు అవుతున్నా అతీగతీ లేదు. స్టేడియంలో పారిశుద్ధ్య నిర్వహణ, కావాల్సిన సౌకర్యాలను పురపాలక నిధులతోనే చేస్తున్నారు. స్టేడియం బాగోగులు, కార్యకలాపాలు చూసే శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ) నుంచి ఎటువంటి భరోసా లభించలేదు. దీనిపై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి నరసింహారెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పట్టభద్రులూ మూడు రోజులే గడువు

- కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుకు చివరి తేదీ 6
- పట్టభద్రుల్లో కొరవడిన అవగాహన
- నామమాత్రంగా దరఖాస్తులు
- అసిస్టేషన్ నిబంధనతో తలనొప్పి

ప్రత్తిపాడు: రానున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటు నమోదుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. అర్హత ఉండీ ఓటు నమోదుకు దూరంగా ఉన్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. కానీ వారు రకరకాల కారణాలతో నమోదుకు ముందుకు రావడం లేదు. ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే పట్టభద్రులు కచ్చితంగా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ లేదా సమానమైన డిప్లమోను పూర్తి చేసి ఉండటంతో పాటు, 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి కోర్సు పూర్తి చేసి ఉన్నవారు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి ఓటు హక్కుకు సిఫార్సు చేస్తారు.

గెజిటెడ్ సంతకాలతో తలనొప్పి..

పట్టభద్రులు ఓటు నమోదుకు దరఖాస్తు చేయాలంటే సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు (ప్రొవిజినల్స్)పై కచ్చితంగా గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించాల్సి ఉంది. ఇది పట్టభద్రులకు కాస్తంత ఇబ్బందికరంగా మారింది. ఇదంతా ఎందుకులే అనుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పరిశీలన సమయంలో రకరకాల కారణాలను చూపిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ప్రత్తిపాడు మండలంలో నివాసులైన పట్టభద్రులు వృత్తిరీత్యా, ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిర పడి ఉన్నారు. వారిలో కొంతమంది ఆన్‌లైన్‌లో తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు విచారణ సమయంలో వారి నివాసాలను సందర్శించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు ఉంటేనే ఆమోదిస్తామని, లేదంటే కుదరదని చెబుతున్నారు. పట్టభద్రులకు ఓటు హక్కుకు ఏయే సర్టిఫికెట్లు కావాలో అవగాహన ఉండడం లేదు. డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, ఫొటో ఉండాలని, ప్రొవిజనల్‌పై గెజిటెడ్ అధికారి అసిస్టేషన్ ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 6వ తేదీ వరకే సమయం ఉంది. అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పరీక్ష ఫీజుకు వేళాయె..

పదో తరగతి వారికి ఈ నెల 11వ తేదీలోపు చెల్లింపునకు అవకాశం



బాపట్ల టౌన్ : పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఫీజులు చెల్లించాలి. ఈ నెల 11వ తేదీలోగా చెల్లించుకోవచ్చు. జిల్లాలో మొత్తం 132 ప్రైవేటు, 200 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు బడుల్లో 6,658 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 11,475 మంది వంతున మొత్తం 18,133 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు 11వ తేదీలోగా నామినల్ రోల్స్ పూర్తి చేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లో లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ నామినల్ రోల్స్ (ఎంఎన్ఆర్) నేరుగా సంబంధిత డీఈవో కార్యాలయంలో సబ్మిట్ చేయాలి. 12 – 18వ తేదీలోగా రూ. 50, 19 – 25వ తేదీలోగా రూ. 200, 26 – 30వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజును చెల్లించవచ్చు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి ఫీజు రూ.125 కాగా, ఫెయిలైన వారికి మూడు, అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ. 110, ఎక్కువ సబ్జెక్టులకు రూ. 125గా నిర్ణయించారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు మామూలు ఫీజుకు అదనంగా మరో రూ.60 చెల్లించాలి. తక్కువ వయసున్న విద్యార్థులు (అండర్ ఏజ్ స్టూడెంట్స్) ఫీజుగా రూ.300 చెల్లించాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



సంఘటనా స్థలంలో రాయపూడి రోశయ్య, కట్టా వీరేంద్రల మృతదేహాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు .. ఎడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన రాయపూడి రోశయ్య (32) సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల సమీపంలోని రైతు నేస్తం కోల్డ్ స్టోరేజ్‌లో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. రోశయ్య భార్యకు 15 రోజుల క్రితం కుమార్తె పుట్టడంతో ఆమెను చూసేందుకు శనివారం ఉదయం బయలుదేరి లింగారావుపాలెం వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తిరిగి ధూళ్ళిపాళ్లకు బయలుదేరాడు. తనతోపాటు లింగారావుపాలెం గ్రామానికి చెందిన బంధువు కట్టా వీరేంద్ర (17)ను కూడా వెంట బెట్టుకుని ద్విచక్ర వాహనంపై ఫ్యాన్ పట్టుకుని వస్తున్నాడు. వెన్నాదేవి సమీపంలోకి వెళ్లగానే సత్తెనపల్లి నుంచి పిడుగురాళ్ల వైపు వెళుతున్న ఆటోను తప్పించే క్రమంలో రోడ్డుపై పడ్డారు. ఆ సమయంలో సత్తెనపల్లి నుంచి పిడుగురాళ్ళ వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం (బస్సు అని భావిస్తున్నారు) వారిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ పి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రోశయ్య, వీరేంద్రలు బంధువులు కావడంతో వారి మృతి వార్త తెలిసి రైతు నేస్తం కోల్డ్ స్టోరేజ్‌లో పనిచేస్తున్న వారి బంధువులు, కుటుంబసభ్యులు ఏరియా వైద్యశాలకు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. రోశయ్యకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరు నుంచి పల్నాటి వీరారాధన ఉత్సవాలు

తరలిరావాలని ఆచారవంతులకు పీఠాధిపతి పిలుపు



పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలు నవంబరు 30వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక అమావాస్య నుంచి ఐదు రోజుల పాటు పల్నాటి వీరుల ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు శనివారం రాచగావు, డిసెంబరు 1వ తేదీ రాయబారం, 2వ తేదీ మందపోరు, 3వ తేదీ కోడిపోరు, 4వ తేదీ బుధవారం కళ్లిపాడుతో ఉత్సవాలు ముగుస్తాయని పీఠాధిపతి పేర్కొన్నారు. మందపోరు చారిత్రక ఘట్టాన్ని స్మరిస్తూ సాగే ఉత్సవం నాడు డిసెంబరు 2వ తేదీ సోమవారం బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారం ప్రకారం కులమతాలకతీతంగా పెద్దల సమక్షంలో అది అమలు జరుగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వీరాచారులు, వీర విద్యావంతులు ఉత్సవాలకు తరలిరావాలని పీఠాధిపతి పిలుపునిచ్చారు. కార్తిక పౌర్ణమి నాడు ఈ నెల 15వ తేదీ పోతురాజుకు పడిగెం కట్టే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆ తర్వాత నుంచి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై దృష్టి పెడతామన్నారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి పల్నాడు వాసి ఎంపిక



సత్తెనపల్లి: జాతీయ స్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి పల్నాడు జిల్లావాసి ఎంపికైనట్లు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. ఆదివారం సత్తెనపల్లిలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడామైదానంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ మెన్ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు గోల్‌కీపర్‌గా షేక్ ఇర్ఫాన్ ఎంపికయ్యాడన్నారు. ఇర్ఫాన్‌ను పలువురు అభినందించారు. ఆయనతో పాటు సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ షేక్ మహ్మద్ రియాజ్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు.

సీపీఎం కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి



దాడిలో గాయపడిన వెంకటేశ్వరరాజు

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో సీపీఎం కార్యకర్తపై టీడీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎండ్రాయి గ్రామంలో సీపీఎం కార్యకర్తగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వృద్ధుడైన నందూరి వెంకటేశ్వరరాజుపై పాత కక్షల నేపథ్యంలో ఎండ్రాయి మెయిన్ రోడ్డుపై టీడీపీ వర్గీయులు గోరంట్ల నాని, గోరంట్ల నాగమల్లేశ్వరరావు రత్నాకర్ ప్రసాద్‌లు దాడిచేశారు. ఈ సంఘటనపై సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ వయస్సు రీత్యా గౌరవం ఇవ్వకపోగా అకారణంగా అసభ్యపదజాలంతో తిడుతూ రోడ్డు మీద పడేసి కొట్టటం దారుణమన్నారు. అధికారం ఉంది మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు. నిన్నుచంపేస్తామని బాధితుడిని బెదిరించారన్నారు.ఈ సంఘటన పై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలని నిందితులను అరెస్టు చేయాలన్నారు. బాధితుడు వెంకటేశ్వరరాజు స్థానిక 30 పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మూడేళ్లు కావస్తున్నా పాత జిల్లా పేరే..!

ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై ఇంకా గుంటూరు జిల్లాగానే..



గణపవరం 1వ సచివాలయం బోర్డుపై గుంటూరు జిల్లా పేరు



గణపవరం 2వ సచివాలయం బోర్డుపై..

నాదెండ్ల: రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన మూడేళ్లు కావస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై ఇంకా పాత గుంటూరు జిల్లాగానే ఉండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 2022లో జిల్లాల పునర్విభజనలో భాగంగా గుంటూరు జిల్లా విభజన చెంది పల్నాడు జిల్లాగా రూపాంతరం చెందింది. నూతన జిల్లాల పేర్లను ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై పొందుపరచాలని అప్పట్లోనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పలుమార్లు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు మండల, గ్రామస్థాయి అధికారులకు సర్క్యులర్లు జారీ చేశారు. అయితే పల్నాడు జిల్లా మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని 1, 2 సచివాలయాల బోర్డులపై ఇప్పటికీ గుంటూరు జిల్లా పేరు కనిపిస్తుంది. పల్నాడు జిల్లా పేరు నమోదు చేయకపోవటం స్థానిక అధికారుల నిర్లక్ష్యానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి మండలంలో పర్యటించినపుడు ఓ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం బోర్డుపై పల్నాడు జిల్లా బదులు గుంటూరు జిల్లా పేరు ఉండటంపై సీడీపీఓకు మెమో జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సదరు అధికారిణి వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాల బోర్డులపై పల్నాడు జిల్లా పేరును మార్పుచేయించారు. ఇప్పటికీ గ్రామాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై జిల్లా పేరు మార్చకపోవటం శోచనీయం.

దేశాన్ని కార్పొరేట్‌మయం చేస్తున్న కేంద్రం

- ప్రజలకు భారం కానున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు
- పోరాటాలకు ప్రజలంతా సిద్ధం కావాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య

సత్తెనపల్లి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల జీవోలను తీసుకువచ్చి దేశం మొత్తాన్ని కార్పొరేట్ మయం చేస్తున్నదని, ఈ విధానాలు రానున్న కాలంలో ప్రజలకు మరింత భారంగా పరిణమించి ప్రజల జీవన పరిస్థితులు అధ్వానమవుతాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం సత్తెనపల్లి పట్టణ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభకు పట్టణ కమిటీ సభ్యుడు కట్టా శివ దుర్గారావు, గద్దె ఉమాశ్రీలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా మహాసభ ప్రాంగణం ముందు సీపీఎం సీనియర్ నాయకులు గుంటూరు వేమయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభ ప్రాంగణంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజా సంఘాలను నిర్మాణం చేసి ప్రజా సమస్యలపై పనిచేసే పార్టీని ప్రజలు నిర్మించాలని ఆయన కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని నిలువరించేందుకు సీపీఎం నిర్విరామంగా కృషి చేసిందన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాదం తీవ్రస్థాయికి వెళ్లిందన్నారు. ప్రతిచోట ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం ప్రతి పండుగలో ఉత్సవాలలోను చొరబడి మతోన్మాదాన్ని ప్రజలలో చొప్పిస్తున్నారన్నారు. ఇటువంటి విషయాలన్నీ ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత సీపీఎం కార్యకర్తలపై ఉందన్నారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన కార్యకలాపాల కార్యదర్శి నివేదికను ధరణికోట విమల మహాసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహాసభలో ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై సమీక్ష చేశారు. అనంతరం కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. అనంతరం మహాసభ 13 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ధరణికోట విమల, ఎం.హరిపోతురాజు, కట్ట శివదుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, జడ రాజకుమార్, పంతంగి ప్రభాకర్, పి.శేషు మణికంఠ, కె.లోక్ నాయక్, మునగా జ్యోతి, షేక్ మస్తాన్ వలి, పులిపాటి రామారావు, షేక్ సైదులు, మండూరి కార్తీక్ లు సమావేశమై సత్తెనపల్లి పట్టణ నూతన కార్యదర్శిగా ధరణికోట విమలను తిరిగి ఎన్నుకున్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్యలు మాట్లాడారు. మహాసభలో పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు, న్యాయవాది పి.పాములయ్య, సీపీఎం నాయకులు పొట్టి సూర్యప్రకాశరావు, అవ్వారు ప్రసాదరావు, ఇంజం లింగయ్య, పెండ్యాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల ఎమ్మెల్యే బావమరిదిపై హత్యాయత్నం

- కారుతో ఢీకొట్టి హతమార్చే యత్నం చేసిన వైనం
- ఆర్థిక లావాదేవిల వల్లే వివాదం
- రెండు వర్గాలు ఒక పార్టీకి చెందిన వారే
- కేసు నమోదు చేసిన పట్టాభిపురం పోలీసులు

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): ఆర్థిక లావాదేవిల నేపథ్యంలో పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బావమరిది రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై గుంటూరు పట్టాభిపురం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేట ప్రాంతానికి చెందిన గాడిపర్తి మాధవరావు పట్టాభిపురంలోని టెంపుల్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటాడు. శనివారం రాత్రి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బావమరిది పులుసు రామకృష్ణారెడ్డితో కలిసి రామకృష్ణ అనే మరో స్నేహితుడి వద్దకు ఇద్దరు వెళ్లారు. అదే ప్రాంతంలో నివాసం ఉండే సుబ్రమణ్యం అనే అతను వచ్చి రామకృష్ణారెడ్డితో వాగ్వాదానికి దిగాడు. నాపై కోర్టులో దావా వేస్తావా అంత మాగడివా అంటూ రామకృష్ణారెడ్డిని ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడి, ఈ రోజు ఎలాగైనా చంపేస్తానని తన బాకీ కూడా పూర్తిగా రద్దు అవుతుందని చెప్పి గొడవకు దిగాడు. అంతటితో ఊరుకోకుండా తన కుమారుడు రిషి రవిచంద్రకు ఫోన్ చేసి రామకృష్ణారెడ్డి దొరికాడని చెప్పి పట్టాభిపురం రావాలని చెప్పాడు. రవిచంద్ర సుమారు 15 మందిని తీసుకుని అక్కడికి చేరుకుని రామకృష్ణారెడ్డిపై దాడికి యత్నించాడు. రవిచంద్ర వెంట వచ్చిన వారు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మాధవరావు తమ్ముడు రాము ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేసే వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఘర్షణకు వచ్చిన వారు పరారయ్యారు. దీంతో మాధవరావు, రామకృష్ణారెడ్డి కారులో పోలీస్ స్టేషన్‌కు బయలు దేరగా, వీరితోపాటు ద్విచక్రవాహనంపై వస్తున్న రామును సుబ్రమణ్యం కుమారుడు రిషి రవిచంద్ర, స్నేహితులతో కలిసి కారుతో ఢీ కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. రాముకు వాహనంపై నుంచి కిందపడి చిన్నపాటి గాయాలయ్యాయి. స్థానికులు అడ్డుకోవడంతో రిషి రవిచంద్ర తన గ్యాంగ్‌తో పరారయ్యారు. మాధవరావు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు వాగ్వివాదం

మాచర్ల ఎమ్మెల్యే బావమరిది రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నంకు పాల్పడిన సుబ్రమణ్యం తరఫున పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ వద్దకు ఆదివారం రాత్రి టీడీపీ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు చేరుకున్నాడు. పోలీస్‌స్టేషన్ బయట మాచర్ల ఎమ్మెల్యే బావమరిదిపై దుర్భషలాడాడు. రామకృష్ణారెడ్డితో వచ్చిన వారికి ఎమ్మెల్యే అనుచరుడి మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. దీన్ని గమనించిన పట్టాభిపురం పోలీసులు స్టేషన్ బయట వాగ్వివాదం జరుగుతుందని తెలుసుకుని బయటకు వచ్చి ఇరువర్గాలకు సర్ది చెప్పారు. దీంతో పశ్చిమ ఎమ్మెల్యే అనుచరుడు స్టేషన్ వద్ద నుంచి వెళ్లిపోయాడు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న మంజుల

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో హోం హాల్‌లో ఉద్యమ అధ్యయన తరగతులు ఆదివారం జరిగాయి. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.కోట్లలో నిలిచాయని పేర్కొన్నారు. వాటిని సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల పెండింగ్ డీఏలను ఎప్పుడు విడుదల చేసేది ప్రభుత్వం చెప్పాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు పని భారంగా మారిన యాప్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అపార్‌లో వస్తున్న ఇబ్బందులు తొలగించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగవరప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్.జిలాని, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌ఖలీద్, ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

అద్దంకి రూరల్: అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదిరిపై అద్దంకి సమీపంలో బైకుతో డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలైన యువకడు ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు. వివరాలు.. అద్దంకి పట్టణంలోని దామావారి పాలెంకు చెందిన వేముల ప్రసన్నబాబు (39) గత నెల 31వ తేదీ రాత్రి బుల్లెట్ బైకుపై శింగరకొండ నుంచి అద్దంకికి వస్తుండగా మార్గమధ్యంలో కూకట్ల కన్వెన్షన్ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన ప్రసన్నబాబు ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. భార్య ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



తెనాలిరూరల్: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. తెనాలి మండలం నందివెలుగు–అత్తోట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం కొల్లిపర వైపు నుంచి వస్తున్న ఆటోను ఎదురుగా మితిమీరిన వేగంతో వస్తున్న కారు ఢీ కొట్టడంతో ఒకే కటుంబానికి చెందిన వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. కొల్లిపరకు చెందిన ఎం.ధన కిషోర్, భార్య దేవరాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి వెళ్లేందుకు తెనాలి రైల్వే స్టేషన్‌కు ఆటోలో బయలుదేరారు. నందివెలుగు పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ఎదురుగా మితిమీరిన వేగంతో వచ్చిన కారు అదుపుతప్పి వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు ధన కిషోర్, దేవరాణి, వీరి కుమారుడు విజయ భాను, ఆటో డ్రైవర్ శ్రీధర్‌కు గాయాలయ్యాయి. కిషోర్ కుమార్తె క్షేమంగా బయటపడింది. స్థానికులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కారు మితిమీరిన వేగంతో వచ్చి తమ ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాలికల విభాగంలో తలపడుతున్న జట్లు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్–14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, డీఎస్ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. గత రెండురోజులుగా జరిగిన పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జిల్లాల జట్లు వివరాలను స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. అండర్–14 బాలికల విభాగంలో తూర్పుగోదావరి, కర్నూలు, విశాఖ, అనంతపురం, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా, చిత్తూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనున్నాయి. అలాగే బాలుర విభాగంలో తూర్పుగోదావరి, చిత్తూరు, విశాఖ, పశ్చిమగోదావరి, అనంతపురం, నెల్లూరు, కృష్ణా, కర్నూలు జట్లు తలపడనున్నాయి. పోటీలకు పరిశీలకునిగా కె.కృష్ణారెడ్డి (పశ్చిమగోదావరి) వ్యవహరిస్తుండగా,వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవిరావు, శ్రీనివాసులు, శివలక్ష్మి, శివపార్వతి, గౌస్ తదితరులు సహకరిస్తున్నారు.

కోటప్పకొండలో రెండు ఆర్వో ప్లాంట్‌లు

- ప్లాంట్‌లు నిర్మించి, నిర్వహణ చేపట్టనున్న దివిస్ సంస్థ
- నెలరోజుల్లో అందుబాటులోకి రానున్న ప్లాంట్‌లు



అన్నప్రసాద కేంద్రం వద్ద ఏర్పాటుచేస్తున్న జలప్రసాదం కౌంటర్

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో జలప్రసాదం ద్వారా రక్షిత శుద్ధ జలాలను భక్తులను అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌కు చెందిన దివిస్ లేబొరేటరీస్ రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో జలప్రసాదం పథకంలో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా కోటప్పకొండ ఆలయంలో రెండు ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆలయ ప్రాంగణంలోని అన్నప్రసాదం వద్ద, పార్కింగ్ వద్ద ఉన్న శ్రీ మేధా దక్షిణామూర్తి విగ్రహం వద్ద రెండు ప్లాంట్‌లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ప్లాంట్ ఏర్పాటు పనులు సంస్థ ప్రారంభించింది. నెల రోజుల్లో రెండు ప్లాంట్‌లు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. ఆయా ప్లాంట్‌ల నిర్వాహణ కూడా దివిస్ సంస్థే చేపట్టనుంది.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

- ధరల పెంపుపై నిరసనగా ఈనెల 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు శివకుమారి



పార్టీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ శాఖల జనరల్ బాడీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కూరగాయల విపరీతమైన అధిక ధరల వలన సామాన్య ప్రజల ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల ఎనిమిదో తేదీ నుంచి 15 వరకు ప్రచార కార్యక్రమం, 15వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో డిసెంబరు ఏడు, ఎనిమిది తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించే పార్టీ జిల్లా మొదటి మహాసభల విజయవంతానికి పట్టణ ప్రజలు సహకారం అందజేసి విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ వన్ టౌన్, టూటౌన్ కార్యదర్శులు సిలార్ మసూద్ సయ్యద్ రబ్బాని, సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు, షేక్ మస్తాన్‌వలి, ధూపం సుభాష్ చంద్రబోస్, మిరపకాయల రాంబాబు, కట్ట కోటేశ్వరావు, జిలాని మాలిక్, సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

ఎస్‌టీయూ డిమాండ్



ఎస్‌టీయూ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

నరసరావుపేట ఈస్ట్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలనీ, లేకుంటే ఉద్యమాలకు సైతం వెనుకాడబోమని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యదర్శి, ఎస్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే 35 శాతం ఐఆర్ ప్రకటించాలనీ, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ ఎరియర్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం సీపీఎస్ రద్దును వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ 117 జీఓను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం లేకుండా చూడాలన్నారు. ఎస్‌టీయూ నాయకులు ఎస్.ఎం.సుభాని, జె.గంగాధరబాబు, వెంకటకోటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



బరువులు ఎత్తుతున్న లిఫ్టరు



విజేతలు జయసాయికృష్ణ, ఎం.పావనితో నిర్వాహకులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ అంతర జిల్లాల (అండర్–17) బాలబాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు రెండోరోజైన ఆదివారం కొనసాగాయి. పోటీల్లో 55 కిలోల బాలుర విభాగంలో గుంటూరు జిల్లాకు చెందిన జి.జయసాయికృష్ణ స్నాచ్‌లో 60 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కిలోలతో సహా మొత్తం 150 కిలోలతో ప్రథమ స్థానం సాధించాడు. కడప, విశాఖకు చెందిన లిఫ్టర్లు ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచారు. బాలికల 40 కిలోల విభాగంలో పశ్చిమ గోదావరి, 45 కిలోల విభాగంలో తూర్పుగోదావరి లిఫ్టర్లు ప్రథమస్థానంలో నిలిచారు. ఈ పోటీలకు ఎస్.కోటేశ్వరరావు, సీహెచ్ గోపీనాథ్, ఎ.వెంకటరామిరెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగశిరీష, వ్యాయామ అధ్యాపకుడు రమేష్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఎం.రవికుమార్ పర్యవేక్షించారు.

వరదలకు పాడైన మోటార్లకు నష్టపరిహారం ఇవ్వాలి



కౌలు రైతులతో మాట్లాడుతున్న హరిబాబు

తాడేపల్లి రూరల్: ఆగస్టులో వరదల ముంపునకు గురై పాడైన ఇంజిన్ ఆయిల్ మోటార్లు, మోటార్ పంపు సెట్లను నమోదు చేసి రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు కౌలు రైతులను కలిసి వరదముంపుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. హరిబాబు మాట్లాడుతూ కృష్ణానది వరద ముంపులో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొందరికే మాత్రమే నష్టపరిహారం చెల్లించిందని విమర్శించారు. తక్షణమే రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం నాయకులు బొప్పన గోపాలరావు, మేడూరి పాములు, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లపాటి సుబ్బారావు, పోకల శంకర్, ధనేకుల వేణు, నారంశెట్టి శివశంకరరావు పాల్గొన్నారు.